క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో పారాయణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సౌందర్య లహరి, శివానందలహరి పారాయణ జరిగింది. అమ్మవారి ఆలయప్రాంగణంలోని ధర్మ పథం వేదికపై వి.ప్రసన్నకుమారి బృందం పలు కీర్తనలను లయబద్ధంగా ఆలపించింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పారాయణలో భాగస్వాములయ్యారు. అనంతరం కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందించారు.

కాలువ గట్లను సుందరీకరించాలి



పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరంలోని మూడు ప్రధాన కాల్వ గట్లను సుందరీకరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. మధురానగర్‌లోని ఏలూరు కాల్వ వెంబడి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ కాల్వ గట్లపై ఉన్న వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని, ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం మొక్కలు నాటి సుందరీకరించాలని సూచించారు. నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వాటిలో వాకింగ్ ట్రాక్, పాత్‌వే, చిన్నారులు ఆడుకునేందుకు ఆటపరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వీటికి 15వ ఆర్థిక కమిషన్ నిధులు వెచ్చించాలని చెప్పారు. ఈ పర్యటనలో ఎస్ఈ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కబేళా సెంటర్ వద్ద లారీ దగ్ధం



భవానీపురం(విజయవాడపశ్చిమ):విజయవాడ నుంచి మచిలీపట్నం పోర్ట్‌కు లోడ్‌తో వెళుతున్న లారీ విద్యాధరపురం కబేళా సెంటర్ వద్ద దగ్ధం అయిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి గ్రానైట్ రాయి లోడుతో బందరు పోర్ట్‌కు వెళుతున్న లారీ కబేళా సెంటర్ దగ్గరకు వచ్చేసరికి లారీ క్యాబిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ లారీ దిగిపోయాడు. నిత్యం రద్దీగా ఉండే కబేళా సెంటర్‌లో టిప్పర్ నుంచి మంటలు ఎగిసి పడుతుండటంతో స్థానికులు పరుగులు తీశారు. వెంటనే కొత్తపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించటంతో హుటాహుటిన అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేసింది.

ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దు

ఏడీసీపీ జి.రామకృష్ణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీ కాళేశ్వరరావు మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని హాకర్లందరూ ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని వెస్ట్‌జోన్ ఏడీసీపీ జి.రామకృష్ణ హెచ్చరించారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, గద్దబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రహదారిని ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తున్న హాకర్లను శుక్రవారం పోలీసు అధికారులు హెచ్చరించారు. అలాగే ఆటో డ్రైవర్లను సైతం రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వాహనాలను నిలుపుదల చేయవద్దని సూచించారు. నడకదారిలో వెళ్లే ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని చెప్పారు. అలాగే వ్యాపారులను పిలిచి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆక్రమణల ద్వారా కలిగే ఇబ్బందులను వ్యాపారులకు వివరించి సహకరించాలని కోరారు. ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్ పర్యవేక్షించారు. అలాగే మరోవైపు ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు ఇతర అధికారులు సైతం ఆక్రమణదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇబ్బందులు కలిగించకుండా ఉండాలని ఆదేశించారు.

పుణ్యస్నానాలకు మోక్షం కలిగేనా?

- అందుబాటులో లేని దుర్గాఘాట్
- నెలలు గడుస్తున్నా జల్లు స్నానాలే
- దుర్గగుడి అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం



జల్లు స్నానాలు చేస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించే భాగ్యం ఇక కలగదా అని భవానీలు, అయ్యప్పలు, శివ దీక్షధారణ చేసే భక్తులు దుర్గగుడి అధికారులను ప్రశ్నిస్తున్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని అత్యంత ప్రాధాన్యత కలిగింది దుర్గాఘాట్. దుర్గాఘాట్ నిర్వహణపై దుర్గగుడి అధికారుల నిర్లక్ష్యం నేపథ్యంలో ఏళ్ల తరబడి భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2016 పుష్కరాల సమయంలో దుర్గాఘాట్‌ను అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి దుర్గాఘాట్‌కు గ్రహణం పట్టుకుంది. గతంలో ఉన్న స్నానఘాట్ ప్లాన్ మార్చి, కొత్త విధానంలో స్నానఘాట్ నిర్మాణం జరిగింది. దీంతో నదికి ఏ మాత్రం వరద వచ్చినా స్నానఘాట్‌లోకి పెద్ద ఎత్తున బురద వచ్చి చేరుతుంది. దీంతో నదిలోకి దిగి స్నానాలు ఆచరించకుండా దుర్గగుడి ఇంజినీరింగ్ అధికారులు ఇనుప మెష్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నదీతీరంలో ఏర్పాటు చేసిన జల్లు స్నానాలను ఆచరించి మమ అనిపించేస్తున్నారు. జల్లు, పంపులతో స్నానాలు చేసే కాడికి ఎన్నో కిలోమీటర్లు ప్రయాణం చేసి నదీ తీరానికి రావడం ఎందుకని పలువురు భక్తులు దుర్గగుడి అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కార్తీక మాసంలో వేలాది మంది......

కార్తీక మాసం ప్రారంభం నుంచి నిత్యం వేలాది మంది భవానీలు, అయ్యప్పలు, శివ దీక్ష స్వీకరించిన భక్తులు దుర్గాఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. రోజుకు 5 వేలకు పైగానే దీక్షదారులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు దుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన భక్తులతో పాటు అమ్మవారికి తల నీలాలు సమర్పించిన భక్తులు సైతం దుర్గాఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తారు. వరద నేపథ్యంలో స్నానఘాట్‌లోకి వరద నీరు వచ్చి నిలిచిపోయిందని దుర్గగుడి అధికారులు చెబుతున్నప్పటికీ బురద తొలగింపుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఏడాదిన్నర కిందట స్నానఘాట్‌లో బురద తొలగింపు పనులు చేపట్టినా అవి పూర్తి స్థాయిలో జరగలేదు. దీంతో ఘాట్‌లోకి తిరిగి బురద వచ్చి చేరింది. ఇప్పటికైనా దుర్గగుడి దేవస్థాన అధికారులు దుర్గాఘాట్‌పై పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర వాసులు కోరుతున్నారు.

ఒకటే ఘాట్....

కృష్ణానదికి ఎగువ నుంచి పున్నమి, భవానీ ఘాట్‌తో పాటు దుర్గాఘాట్ అందుబాటులో ఉన్నాయి. ఇక దుర్గాఘాట్ సమీపంలోని మోడల్ గెస్ట్ హౌస్ స్నాన ఘాట్ అందుబాటులో ఉన్నప్పటికీ అది వీఐపీలకు, స్వామీజీలు పుణ్యస్నానాలు ఆచరించేందుకు కేటాయించారు. అటు సీతానగరం వైపున స్నాన ఘాట్లు ఉన్నా అంత దూరం ప్రయాణం చేసే అవకాశం లేకపోవడంతో భక్తులు దుర్గాఘాట్‌లోనే పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. భవానీ, పున్నమి ఘాట్లలో పిండ ప్రదానం చేసేందుకు కేటాయించారు. తాజాగా పవిత్ర కృష్ణానదికి ప్రతి నిత్యం సాయం సంధ్య వేళ నవ హారతులు ఇస్తున్న నేపథ్యంలో దుర్గాఘాట్‌కు విచ్చేసే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది.



ఘాట్ వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటున్న అయ్యప్పస్వాములు

కేంద్ర ప్రభుత్వ పథకంపై సమీక్ష



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ (ఎన్ఎల్‌యూఎం) 2.0 అంశంపై మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ కుల్దీప్ నారాయణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నేషనల్ అర్బన్ లబ్లీ హుడ్ మిషన్ 2.0 ద్వారా కేంద్ర ప్రభుత్వం 6 క్యాటగిరిలో ఉన్న కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులకు రుణ సదుపాయం కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా విజయవాడ, విశాఖపట్నం నగరాలను ఎంపిక చేశాయని తెలిపారు. నేషనల్ అర్బన్ లైవ్లి హుడ్ మెషిన్ 2.0 అమలు నవంబర్ 1 తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్ట్ ప్రాంభించేందుకు కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులైన భవన నిర్మాణ కార్మికులు, ఇంటి పనిచేసే, రవాణారంగంలో ఉన్నవారు, హాస్పిటాలిటీ, వ్యర్థాలు సేకరించే వారితో నగరంలో 150 గ్రూపులతో సిద్ధంగా ఉన్నందుకు మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ కుల్దీప్ నారాయణ్ అభినందించారు. ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా అర్హత కలిగిన లబ్ధిదారులకు కేంద్ర సంక్షేమ పథకాలు అందించటం, స్వయం సహాయక సంఘాలు, కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్స్, ఏర్పాటు చేయటం, ఈ గ్రూపులు తయారుచేసిన వస్తువులను మేళ ద్వారా ఎగ్జిబిషన్లో ప్రోత్సహించటం జరుగుతుందని, కేర్ క్లస్టర్స్, డే కేర్ సెంటర్స్, షెల్టర్స్, ఇలాంటివి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవటమే ఈ పైలెట్ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, అడిషనల్ మిషన్ డైరెక్టర్ కేఎస్ వెంకటేశ్వరరావు, స్టేట్ మిషన్ మేనేజర్లు ఆర్. ఆదినారాయణ, వి. ప్రభావతి, జి. రంగాచార్యులు, ఎస్. ఎస్. ఆర్. శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ అమత్ మరియు ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ ఇన్‌చార్జ్ డాక్టర్ లత, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఫణి కుమార్, శేఖర్, శ్యామల, సుజాత, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలు కాపాడుకోవాలి

విజయవాడ కల్చరల్: సంప్రదాయ నృత్య కళలను కాపాడుకోవాలని నాట్యాచార్యుడు వేదాంతం రాధేశ్యాం అన్నారు. శ్రీవాగ్దేవీ కూచిపూడి నృత్యాలయం రెండురోజులపాటు నిర్వహించే కూచిపూడి నృత్యహేల, నాట్యాచార్యుడు కాజవెంకట సుబ్రహ్మణ్యంకు గురు సత్కారం, సంప్రదాయ నృత్య ప్రదర్శనల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. నృత్య కార్యక్రమాలను ప్రారంభించి రాధేశ్యాం మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను భారతీయ వారసత్వ సంపదగా భావించాలని సూచించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ నృత్య కళాకారులు చిత్త శుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం, అంకిత భావం కలిగివుండాలని సూచించారు. నాట్యాచార్యులు ఘంటసాల పవన్ కుమార్ సభకు అధ్యక్షత వహించారు. వివిధ రంగాలకు చెందిన డోగిపర్తి శంకరరావు, వీజీపీవీడీఎస్ కుమార్, తటవర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు. నాట్యాచార్యుడు బి.శారద, కె.సాయి లక్ష్మి, మాగలూరి త్రినాథాచారి, వి.రమణకుమారి, అనూషా నాయుడు, సాయి లక్ష్మి, తమ బృందాలతో సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. నాట్యాచార్యుడు కాజ వెంకట సుబ్రహ్మణ్యంకు నిర్వాహకులు గురు సత్కారం, నాట్యంలో ప్రతిభ కనపరచిన చిన్నారులకు శ్రీ వెంకటేశ్వర, శివనంది, స్వర్ణనంది పురస్కారాలు ప్రదానం చేశారు. సప్పా ధనలక్ష్మి నిర్వహించారు.

నేడు కేబీఎన్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తూనికుంట్ల శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో శనివారం హెచ్‌ఆర్ కాంక్లేవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంపెనీలు తమ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించే క్రమంలో అభ్యర్థుల నుంచి ఏ విధమైన అర్హతలను, నైపుణ్యాలు ఆశిస్తాయి, వారికి ఎటువంటి విద్యార్హతలు ఉండాలనే అంశాలపై ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలు కంపెనీల హెచ్‌ఆర్‌లు ఈ సదస్సులో పాల్గొని విద్యార్థులు ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు. అదేవిధంగా విద్యార్థులు అడిగే ప్రశ్నలకు, సందేహాలకు వారు సమాధానాలిస్తారని వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలకోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరుస్తున్న ఆవిష్కరణలు



ప్రాజెక్ట్ ఎక్స్‌పోను తిలకిస్తున్న వెంకటశ్రీరామ్, డాక్టర్ దేవకుమార్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో జరిగిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో - 2024 అబ్బురపరుస్తోంది. ఆ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. వ్యవసాయం. పరిశ్రమలు, సాధారణ ప్రజలు నిజజీవితంలో వినియోగించేందుకు, విద్యుత్‌ను ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించేందుకు వీలుగా పలు ఆవిష్కరణలు అందరినీ అలరిస్తున్నాయి. విద్యార్థులు తమ ఆవిష్కరణల ద్వారా సామాజిక వికాసానికి పాటుపడాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఏపీ సెంట్రల్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ వెంకటశ్రీరామ్, కార్యదర్శి డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ తెలిపారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిభ కలిగిన వారికి విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెట్టాలని సూచించారు. న్యాయనిర్ణేతలుగా గుణదలలోని ఎలక్ట్రికల్ స్టేషన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తాడికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ



ఇంటింటికీ వెళ్లి లార్వా పెరిగే ప్రాంతాలపై అవగాహన కలిగిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల భాగస్వామ్యంతోనే దోమలు వృద్ధి చెందకుండా లార్వాను నియంత్రించగలుగుతామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని పటమటలంక తదితర ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇళ్లలో లార్వా వృద్ధి చెందే ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. లార్వా కనుగొనే కార్యక్రమాన్ని మలేరియా సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం పటమటలోని జిల్లా పరిషత్ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పటమట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిహారిక, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ తనిఖీలు

లబ్బీపేటలోని నెక్సస్ గ్రోత్ సంస్థకు నోటీసులు



ఐసీఐసీఐ భారతీనగర్ బ్రాంచ్

విజయవాడస్పోర్ట్స్: ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాదారుల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఓవర్‌డ్రాఫ్ట్‌లు, బంగారు రుణాల నగదును దారి మళ్లించిన వైనంపై సీఐడీ విచారణ చురుగ్గా సాగుతోంది. చిలకలూరిపేట, నరసరావుపేట బ్రాంచ్‌ల ఖాతాదారులు ఫిర్యాదుతో ఈ విషయం తొలుత వెలుగు చూసిన విషయం తెలిసిందే. అయితే విజయవాడలోనూ పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐడీ అధికారులు భారతీనగర్ బ్రాంచ్‌లో శుక్రవారం విచారణ నిర్వహించారు. ఏకకాలంలో మూడు బృందాలు బ్యాంకులో సోదాలు చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విజయవాడ బ్రాంచ్‌లలో మేనేజర్‌గా పని చేసిన నరేష్ ఈ అవినీతికి పాల్పడినట్లు అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు సమాచారం. నరేష్, అతనికి సహకరించిన మరి కొందరు వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఓవర్ డ్రాఫ్ట్, గోల్డ్ లోన్ ఖాతాదారులకు నకిలీ పత్రాలు ఇచ్చి నరేష్ మోసానికి తెగబడ్డారు. దీని ద్వారా వచ్చిన నగదును నరేష్, అతని సన్నిహితులు నెక్సస్ గ్రోత్ సంస్థ ద్వారా షేర్ మార్కెట్ పెట్టుబడులు పెట్టినట్లు సీఐడీ అధికారుల విచారణలో స్పష్టమైంది. నరేష్ బ్యాంకు ఖాతా లావాదేవీలను పరిశీలించిన అనంతరం లబ్బీపేటలోని నెక్సస్ గ్రోత్ సంస్థకు ఈ నెల 25న సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. పలు ఖాతాల ద్వారా నగదును నెక్సస్ గ్రోత్‌కు నరేష్, మరి కొంత మంది వ్యక్తులు బదిలీ చేశారని ఈ నోటీసుల ద్వారా స్పష్టమవుతోంది. నరేష్ చేసిన మోసంలో నెక్సస్ గ్రోత్ సంస్థకు సైతం భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. సీఐడీ విచారణ వేగవంతమైన నాటి నుంచి నెక్సస్ సంస్థ ప్రతినిధులు సైతం పరారీలో ఉన్నారు. ఖాతాదారులను బురిడీ కొట్టించి కాజేసిన నగదుతో నరేష్ టీం విజయవాడ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నడిపినట్లు విశ్వసనీయ సమాచారం.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాల కిట్లను అందుకున్న బాధితులతో ఫినోలెక్స్ సిబ్బంది, కృష్ణ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద బాధితులకు ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ముకుల్ మాధవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17వస్తువులతో కూడిన నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. 45వ డివిజన్ పరిధిలోగల రోటరీనగర్, భగత్‌సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలలో నివసిస్తూ వరద కారణంగా నష్టపోయిన బాధితులకు సితార సెంటర్ సమీపంలోని బాలాజీ కాలనీలో శుక్రవారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఫినోలెక్స్ కంపెనీ ఏపీ, తెలంగాణ హెడ్ సంకా శ్రీహరిరావు, ఎ.భాస్కరరావు మాట్లాడుతూ తమ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా రెండు వేల మంది వరద బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశామని తెలిపారు. వరద ముంపులో సర్వం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న బాధితులను ఆదుకోవడం సంస్థ సామాజిక బాధ్యతగా భావించి ముందుకు వచ్చిందని చెప్పారు. 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య, నాయకులు మైలవరపు కృష్ణ మాట్లాడుతూ డివిజన్‌లో నివసించేవారిలో అధిక భాగం పేదవర్గాల ప్రజలేనని, ఇటీవల సంభవించిన బుడమేరు వరద కారణంగా ఇళ్లన్నీ మునిగిపోయి అందులోని గృహోపకరణాలు, మంచాలు కొట్టుకు పోవడంతో జీవితంతో పదేళ్ల వెనక్కి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రానున్న దీపావళి పండుగకు ఇబ్బందులు పడకుండా నిత్యావసర సరుకులు అందించిన ఫినోలెక్స్ కంపెనీ యాజమాన్యం అభినందనీయులన్నారు. కార్యక్రమంలో బాలాజీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బీటీ రమేష్, సెక్రటరీ వెంకటయ్య, ఉపాధ్యక్షులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు ఆర్థిక సాయం అందజేత



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్, పక్కన అసోసియేషన్ పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బీఎస్ఎన్ఎల్ పింఛన్ దారుల సమస్యల పరిష్కారానికి సంస్థ కృషి చేస్తుందని.. వరదల బారిన పడిన పింఛన్‌దారులంతా త్వరగా కోలుకోవాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. బుడమేరు వరద ముంపులో నష్టపోయిన బీఎస్ఎన్ఎల్ పెన్షన్‌దారులకు బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత కార్యక్రమం సింగ్‌నగర్ గుజ్జుల సరళా దేవి కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ నగర ప్రజలు ఎన్నడూ లేనివిధంగా వరద ముంపులో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ పెన్షన్‌దారులు కూడా చాలా వరకు నష్టపోయారని, వారికి బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం 85 మంది బాధిత పెన్షనర్స్‌కి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ కోటేశ్వరరావు, కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు కె.పూర్ణ చంద్రరావు, కార్యదర్శి సి.భాస్కరరావు, సంస్థ డిప్యూటి జనరల్ డీజీఎం ఉమామహేశ్వరరావు, ఏజీఎం పోతురాజు, నారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా సమస్యలు ఎదుర్కోవాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



జ్యోత్స్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు పనిచేస్తున్న ప్రదేశంలో ఎన్నో రకాల వేధింపులకు గురవుతున్నారని మానసికంగా ధైర్యంగా ఉండి వాటిని ఎదుర్కోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల సమస్యలు-పరిష్కారాలు అనే అంశంపై సదస్సు శుక్రవారం జరిగింది. రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పనిచేస్తున్న ప్రదేశంలో, ప్రయాణాల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని మానసికంగా ధైర్యంగా ఉండి ఎదుర్కోవాలని చెప్పారు. అవసరమనిపిస్తే మహిళా సంఘాలను లేదా మహిళా కోర్టులను ఆశ్రయించవచ్చని చెప్పారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్షపై ప్రతి మహిళా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ రిటైర్డ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.సుహాసిని మాట్లాడుతూ గతంలో మహిళల్లో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేదని అందువల్ల మహిళలు ఇంటి పనులకే పరిమితం అయ్యేవారని చెప్పారు. అన్ని రంగాల్లో పురుషులతో పాటుగా సమానంగా పనిచేస్తున్నారని చెప్పారు. పురుషులు, మహిళలను సమానంగా చూసే పరిస్థితులు సమాజంలో రావాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.వి ద్యాకన్నా, డైరెక్టర్ ఎ.పూర్ణిమతో పాటుగా జనశిక్షణ సంస్థాన్ శిక్షణార్థులు పాల్గొన్నారు. సభకు ముందుగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సేఫ్ సంస్థ వ్యవస్థాపకురాలు జీ.జ్యోత్స్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సద్గురువుల సేవలు సర్వదా శుభకరం



సంగీత కార్యక్రమాలను ప్రారంభిస్తున్న బీవీఎస్ ప్రకాష్, వేదికమీద నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సద్గురువుల సేవలు సర్వదా శుభకరమని శ్రీ సంగీత సద్గురు అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ అన్నారు. కృష్ణమాచారి కళా పీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వాన్ మణి శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు శత జయంతి ముగింపు ఉత్సవాల నేపథ్యంలో నిర్వహిస్తున్న జాతీయ సంగీతోత్సవాలు శుక్రవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకాష్ మాట్లాడుతూ జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడే గురువని తెలిపారు. కళాపీఠం కార్యనిర్వాక సంఘ సభ్యులు ఎస్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, రామానుజా చార్యులు, శ్రీరామ చక్రవర్తి, కె.రంగనాయకి పాల్గొన్నారు. సద్గురువులకు సంగీత సేవలో భాగంగా వి.సౌమ్య, ఆర్.లక్ష్మీ రచిత, ఎ.రుక్మిణి, కృష్ణలాస్య బృందగానంతో వాగ్గేయకార కీర్తనలు ఆలపించారు. పి.కుమార్ బాబు వేణువుతోనూ వి.శ్రీవిద్య వీణపై పలు కీర్తనలు ఆలపించారు. దుడ్డు మనస్విని, ముదుంబై లక్ష్మీచారి, దుడ్డు రాధిక, పోపూరి గౌరీనాథ్ ఎన్‌సీ మాధవ్, ఎన్‌సీ అనంత కృష్ణ సంగీత సేవలో పాల్గొన్నారు. కౌశిక్ కల్యాణ్ నిర్వహించారు.

27న ఎడ్యుకేషన్ ఫెయిర్

పటమట(విజయవాడతూర్పు):పటమటలోని ఎస్ఎస్ఎం స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాలారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 27న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఫెయిర్ ఉంటుందని చెప్పారు. ఇందులో 36 యూనివర్శిటీలు పాల్గొంటాయని, ఇంజినీరింగ్, మెడికల్, జీవశాస్త్రం, ఫ్యాషన్, సైకాలజీ వంటి కోర్సుల్లో ఉండే అవకాశాలు, అనంతరం ఉండే ఉపాధిపై నిపుణులు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని 10,12 తరగతులు చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆటో డ్రైవర్‌పై బీరు బాటిల్‌తో దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటో డ్రైవర్‌పై బీరుబాటిల్‌తో దాడి చేసి గాయపరిచిన ఘటన గొల్లపూడిలో చోటు చేసుకుంది. గొల్లపూడికి చెందిన చరణ్‌సాయి స్నేహితుడు ప్రవీణ్, భార్య షైనీ ప్రియాతో కలిసి ఆటోలో వెళ్తున్నారు. సచివాలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా గోవిందు అనే వ్యక్తి బైక్‌పై కూర్చుని బీరు తాగుతున్నాడు. అతను ఆటో ఆపి బీరు బాటిల్‌తో చరణ్‌సాయి తలపై కొట్టాడు. మెడపై పొడిచాడు. దీంతో చరణ్‌సాయికి తీవ్ర గాయాలై రక్తపోవడంతో స్పృహ తప్పిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి గాయపడిన చరణ్ సాయిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చరణ్ సాయి స్నేహితుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.